క్లుప్తంగా

ఈరన్న స్వామికి పూజలు



కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజ లు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనానికి తెలంగాణ రాష్ట్రం, గద్వాల జిల్లా పద్ద ధన్వాడకు చెందిన పి. హనుమంయ్య, వీరేష్ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజుకు అందజేశారు.

న్యాయవాదికి పరామర్శ



ఆసుపత్రిలో న్యాయవాది గురురాజారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: మంత్రాలయం మండలం మాలపల్లె గ్రామంలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ మంత్రాలయం నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యాయవాది గురురాజారావును మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరామర్శించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను సోమవారం మాజీ ఎమ్మెల్యే వెళ్లి దాడికి కల కారణాలను అడిగి తెలుసుకొని చికిత్స పొంది కోలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ ఖాశింబేగ్, నాగేశ్వరరావు, పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది ఎంకే గురురాజరావును వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, బూత్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఎమ్మిగనూరులోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్టీయూ ఆవిర్భావదినోత్సవం

ఎమ్మిగనూరుటౌన్:పట్టణంలో సోమవారం ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆసంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక కార్యాలయం వద్ద ఎస్టీయు జెండాను ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు నాగరాజు, ప్రసన్నరాజు, యల్లప్ప, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: పట్టణంలోని 8వ వార్డు సచివాలయంలోని ఆధార్ కేంద్రం వద్ద అధిక వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్, నాయకులు వెంకటేష్ కోరారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సచివాలయంలోని ఆధార్ కేంద్రంలో ప్రజల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్నారన్నారు.

అద్దెలు వసూలు చేయాలి

మంత్రాలయం రూరల్ : మండలంలోని మంచాల గ్రామంలో తుంగభద్ర నది పోరంబోకు స్థలంలో నిర్మించిన దుకాణాలకు పంచాయతీ కార్యదర్శులు అద్దెలు వసూలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘాల నాయకులు జిల్లా పంచాయతీ అధికారి జి, భాస్కర్‌కి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..400 దుకాణాలకు సంబంధించి అద్దెను పంచాయతీ అధికారులు అద్దెను వసూలు చేయాల్సి ఉందని, అయితే అందుకు విరుద్ధంగా మఠం అధికారులు వసూలు చేస్తున్నారని వివరించారు. తద్వారా పంచాయతీకి దాదాపు ఏడాదికి రూ.5 కోట్లు నష్టం వాటిల్లితుందని ఆరోపించారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



స్కానింగ్ పరీక్షలకు వచ్చిన గర్భిణులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి 427 మందికి స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరిండెంట్ డాక్టరు సుధా చెప్పారు. స్కానింగ్ పరీక్షల్లో గైనకాలజిస్ట్ డాక్టర్లు సుజిత, ఫాతిమాలు ఉన్నారు. అదే విధంగా స్కానింగ్ పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇరుకైన కాలువలు.. ఇళ్లలో చేరిన నీరు



ఇటీవల నిర్మించిన డ్రైనేజీ



బేగంకు చెందిన గుడిసెలో చేరిన వర్షపు నీరు

కౌతాళం: మండలంలో ఆదివారం రాత్రి 7గంటల నుంచి సోమవారం తెల్లవారు జామున 3గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. 58 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. కాగా మండల కేంద్రమైన కౌతాళంతో పాటు ఉప్పరహాల్ గ్రామంలో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరాయి. కౌతాళంలోని ఉప్పరవీధిలో ఇటీవల నిర్మించిన డ్రైనేజీ కాలువ చిన్నది ఉండటంతో వర్షపు నీరు ముందుకు వెళ్లలేక ఇళ్ల ముందు నిలిచిందని బాధితులు బేగం, ఖాదర్‌బాషా తదితరులు వాపోయారు. ఎన్నో ఏళ్లుగా మురుగు నీరు ఇళ్ల వద్ద నిల్వ ఉంటున్నాయని అధికారులకు మొరపెట్టుకోగా ఇటీవల డ్రైనేజీ నిర్మించారని, అయితే కాలువ చాలా చిన్నగా, ఇరుకుగా ఉండటంతో వర్షపు నీరు వెళ్లలేక ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ కనీసం మూడు అడుగుల వెడల్పు నిర్మించి ఉంటే నీరు పోయేందుకు వీలుండేదని తెలిపారు. వర్షంపు నీరు ఇంట్లో చేరడంతో నీటిని బయటకు తొడడానికి రాత్రంతా కష్టపడాల్సి వచ్చిందని బేగం ఆవేదన వ్యక్తం చేసింది. అదేవిధంగా ఉప్పరహాల్ గ్రామంలో కూడా భారీ వర్షానికి నీరు ఇళ్లల్లోకి చేరాయి. దీంతో ఇళ్లలో నిల్వవున్న ధాన్యం తడిసిపోయిందని బాధితుడు ఉసేని తెలిపాడు. తనకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు విన్నవిస్తున్న బాధిత కాంట్రాక్టర్ బి.శివరాముడు

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగవంతంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ వేణుసూర్య, శ్రీనివాసరావు, డీఎల్‌డీఓ రమణారెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ షఫీవుల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సబ్‌కలెక్టర్ సమావేశం

సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సాయంత్రం స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా రాజకీయ పార్టీల నాయకులు, సంబంధిత అధికారులతో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదోని నియోజకవర్గ ఓటరు జాబితా, నూతన ఓటర్ నమోదు ఫారం 6, 7, 8 సంబంధత అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎన్నికల డీటీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

బిల్లు బకాయి ఇప్పించండి

పెద్దకడబూరు: తాను చేసిన కాంట్రాక్ట్ డబ్బులు ఇతరుల అకౌంట్‌కు జమచేసి తనను మోసం చేశారు. తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు శివరాముడు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామానికి చెందిన బి.శివరాముడు (సర్పంచ్ భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు) గత కొంతకాలంగా చిన్నచిన్న కాంట్రాక్ట్ పనులు చేసుకుంటున్నాడు. ఇది వరకు ఉపాధి హామీ పథకం కింద దాదాపు రూ. 22.53లక్షల పనులు చేయించాడు. అందులో రూ. 11.60లక్షలు తన బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. మిగిలిన మొత్తం రూ. 10.93లక్షలు జమ కాలేదు. ఈ విష యంపై పలు మార్లు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగాడు. చివరక స్పందించిన సంబంధిత అధికారులు మీ పేరుపై ఎలాంటి బిల్లు పెండింగ్‌లో లేవని సమాధానం ఇచ్చారు. దాదాపుగా రూ. 11లక్షలు డబ్బు రావాల్సి ఉండగా సంబంధిత అధికారులు మాత్రం ఎటువంటి బ్యాలెన్స్ లేవని చెబుతుండడంతో సబ్ కలెక్టర్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్సీ, ఫెయిత్ హోం చైర్మన్ డాక్టర్ మధుసూదన్

ఆదోని సెంట్రల్: స్థానిక పీపుల్స్ పాఠశాల (ఏ యూనిట్ ఆఫ్ ఫెయిత్ హోం)లో కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్ సమ్మర్ క్యాంపు కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్సీ, ఫెయిత్ హోం చైర్మన్ డాక్టర్ మధుసూదన్, మేనేజింగ్ ట్రస్టీ బిషప్ డానియల్ ప్రేమ్‌కుమార్‌ల చేతులమీదుగా 7 గ్రామాల నుంచి 35 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల సిబ్బంది శ్రీవాణిరెడ్డి, జొనాథన్, సంధ్యారాణి, పాఠశాల సిబ్బంది సంగటి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయకపోవడంలో ఆంతర్యమేమిటి?



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : దళితుడిపై దాడిచేసి 6రోజులు గడుస్తున్నా దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయకపోవడం పోలీసుల వైఫల్యమేనని జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ మండిపడ్డాడు. సోమవారం బాధితుడితో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మేకడోణ గ్రామానికి చెందిన దళిత అయ్యప్పపై అదే గ్రామానికి చెందిన మైనార్టీ కులానికి చెందిన ఏడుగురు గత 4వ తేదీన పొలం వద్ద గొడవపడి మూకుమ్మడిగా దాడి చేశారన్నారు. దాడిలో గాయపడిన అయ్యప్ప ఆదోని ఏరియా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని 5వ తేదీన పోలీస్ స్టేషన్‌కు వచ్చి కంప్లెయింట్ చేశాడని, అయినా నేటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. దీనికి కారణం వారికి కూటమి నాయకుల అండదండలు ఉండటంతోనే అని ఆరోపించాడు. దాడికి పాల్పడ్డ వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ ఇచ్చేంతవరకు ఇక్కడ నుంచి కదిలేదే లేదని స్టేషన్ ముందే భీష్మించుకుకుర్చున్నారు. జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షుడు శావల బుజ్జి, పెద్దకడబూరు మండల నాయకులు యోహాన్, ఆదాము, ప్రభాకర్, సిమోను, అనిల్, కర్ణ. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న సాయిపూర్తిక

పెద్దకడబూరు: ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు మండలం నుంచి నలుగురు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన సాయిపూర్తిక, పార్వతి, కావేరి, సుమంత్ కుమార్‌లు సోమవారం కర్నూలులోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డీఈఓ శ్యామూల్‌పాల్, జాయింట్ కలెక్టర్ నవ్య చేతులు మీదుగా అందుకున్నారు. ఈ విద్యార్థులకు పాఠశాల ప్రిన్స్‌పాల్ రంగన్న, సిబ్బంది, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

కోసిగి: మండలం నుంచి నలుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డును సోమవారం డీఈఓ శ్యామూల్‌పాల్, మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా అందుకున్నారు. మోడల్ స్కూల్‌కు చెందిన వినయ్ కుమార్, ప్రణయ్‌కుమార్‌రెడ్డి, మౌంట్‌కార్మేల్ పాఠశాలకు చెందిన వీరేష్, సాయి జస్వంత్‌కుమార్ అవార్డును అందుకున్నారు.

కౌతాళం : పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన బదినేహాల్ జెడ్పీ పాఠశాల విద్యార్థి మహమ్మద్ యాసీన్, కౌతళంలోని ప్రతిభ హైస్కూల్ విద్యార్థి శివప్రసాద్, సారిక, కౌతాళం జెడ్పీ పాఠశాల నరేష్, హాల్వి పాఠశాలలో వెంకటేశ్ మొద్ద ఐదుగురు సోమవారం కర్నూలులో అవార్డులు అందుకున్నారు. విద్యార్థులకు రూ. 20వేల నగదుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసినట్లు ఎంఈఓ శోభరాణి తెలిపారు.

ఆదోని సెంట్రల్: పట్టణంలోని డా.జ్యోతిర్మయి జూనియర్ కళాశాల విద్యార్థిని ఉమాదేవి ఇంటర్మీడియెట్‌లో 971 మార్కులు సాధించి జిల్లా స్థాయి ప్రతిభా పురస్కారాన్ని అందుకుంది. సోమవారం కర్నూలులో జరిగిన కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ చేతులమీదుగా పురస్కారాన్ని అందజేశారు.

మంత్రాలయం రూరల్ : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన స్థానిక శ్రీ వైష్ణవి స్కూల్ విద్యార్థులు వైష్ణవ సంజన, జంగం రష్మిత, గురు ప్రసన్న, మల్లికార్జున గౌడ్, జయరాముడు ప్రభుత్వం నుంచి షైనింగ్ అవార్డులు పొందారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకోం

ఆదోని రూరల్: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోబోమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, పట్టణాధ్యక్షుడు భీమేష్, వెంకన్న అన్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా సోమవారం ఆదోనిలోని ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులను తొలగించడం, రెగ్యులర్ కార్మికులను పదవీ విరమణ చేయాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, లక్ష్మన్న, షేక్షావలి, ఎల్లప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

మంత్రాలయం రూరల్: చిన్న, సన్న కారు రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని రైతు సాధికార సంస్థ మండల ఇన్‌చార్జీ పద్మశ్రీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులైన ఆకుకూరలు, కూరగాయాలు విక్రయించారు. కార్యక్రమంలో ఏఓ రాధ,ఏపీసీఎన్ఎఫ్ కార్యకర్తలు లక్ష్మీ, గౌరమ్మ, శృతి, రమేష్ పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం



పెద్దకడబూరులో యోగాంధ్ర అవగాహన ర్యాలీ

పెద్దకడబూరు : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ ప్రభావతి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో యోగాంధ్ర ప్రత్యేకాధికారిణి ఉమామహేశ్వరి, ఈఓపీఆర్డీ జయరాముడు పాల్గొన్నారు.

నందవరం : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పుల్లయ్య అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం-1 ఆవరణ నుంచి పోలీస్‌స్టేషన్ ప్రధాన రహదారి వరకు ర్యాలీ యోగాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడ్, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పీఆర్ ఏఈ నరసింహులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా వుండవచ్చని తహసీల్దార్ శేషఫణి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. సోమవారం యోగాంధ్రలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బంగారమ్మ పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రం మంత్రాలయంలో యోగా ఆంధ్రపై వెలుగు అధికారులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ మొయిన్‌ద్దీన్, వెలుగు సీసీ కాజా, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి

ఆదోని రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, డివిజన్ కార్యదర్శి బసాపురం గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆదోని తహసీల్దార్ శివరాములకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మిరెడ్డి, తిమ్మప్ప, హనుమంతు, బసప్ప, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

నందవరం : కూటమి ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు ధర్నా చేశారు. అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్‌రావుకి అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు రామలింగడు, మల్లేష్, ముని, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దిగజారిన దేశ ఆర్థిక స్థితి

ఎమ్మిగనూరుటౌన్: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశ ఆర్థిక స్థితి పూర్తిగా దిగజారిందని సీపీఎం జిల్లా కార్యదర్శులు అంజిబాబు, రాధాకృష్ణ ఆరోపించారు. పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న సీపీఎం రాజకీయ శిక్షణాతరగతుల్లో భాగంగా సోమవారం వారు పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. దేశ సంపదను సంపన్న వర్గాలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోవిందు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్‌గానే బదిలీలు నిర్వహించాలి

ఎమ్మిగనూరుటౌన్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్‌గానే బదిలీలు నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు దావీదు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమణి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత నెలలో విద్యాశాఖ కమిషనర్‌తో నిర్వహించిన చర్చల్లో ఎస్‌జీటీలకు మ్యానువల్‌గానే బదిలీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపడతామని చెప్పడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు మల్లారి నాగరాజు, కె.నాగరాజు, రాఘవేంద్ర, రాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా హక్కుచట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా సీట్లు కేటాయించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి స్థానిక మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఎదుట బైఠాయించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘ జిల్లా కార్యదర్శి శేఖర్, యూఎస్ఎఫ్ఐ, ఎస్ఎస్‌యూఐ నాయకులు ఉదయ్, వీరేష్ యాదవ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లో తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 2500ల మంది కార్మికులను సత్వరం విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు వీరేష్, తిమ్మగురుడు, రాజు, ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు.ర్యాలీగా వెళ్లి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజయేంద్ర, మహేంద్రబాబు, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి శోచనీయం

ఎమ్మిగనూరుటౌన్: న్యాయవాది గురురాజారావుపై దాడి శోచనీయమని స్థానిక ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్ సోమవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. భౌతిక దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. బాధిత న్యాయవాదికి బ్రాహ్మణ సంఘం అండగా వుంటుందని తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి



డీఎస్పీ ఉపేంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు



ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్: న్యాయవాది గురురాజారావుపై దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీదుల్లా, న్యాయవాదులు ఆనంద్, నాగన్న, మురళీకృష్ణ, రఘురాం, నాగన్న, రంగనాథ్, నాగరాజు, మల్లికార్జున రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక డీఎస్పీ ఉపేంద్రబాబును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దాడి జరిగినా కేసు నమోదు చేయడంలో జాప్యం చేయడం తగదని, హత్యా నేరం కింద కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆదోని రూరల్: న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతోందని ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది గురురాజాపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరాములు, కార్యదర్శి జీవన్‌సింగ్, న్యాయవాదులు సునీతరెడ్డి, అనితాబాయ్, సుబ్రహ్మణ్యంశర్మ, వెంకటేష్, నాసీర్, మధు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమితులైన గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురువ మల్లయ్యతో పాటు డైరెక్టర్లుగా పలువురితో యార్డ్ కార్యదర్శి పద్మావతి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో పాటు వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం



క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్, వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: క్షయ వ్యాధి నిర్మూలనకు పాటుపడదామని కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్, సూపర్‌వైజర్ బాబురాజు, టీబీహెచ్‌వీ సుబ్బమ్మబాయి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 39వ వార్డు హనుమాన్‌నగర్‌లో క్షయవ్యాధి నిర్మూలనపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు క్షయవ్యాధి పట్ల అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణితలు తదితర వాటిలో ఏ ఒక్క లక్షణం ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విద్యావతి, ఆశావర్కర్ వెంకటలక్ష్మి, సిబ్బంది యూపీహెచ్‌సీ హనుమాన్‌నగర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి

కోసిగి : క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు కోసిగి వైద్యాధికారి రాజకిరీటి తెలిపారు. సోమవారం కోసిగి - 2 హెల్త్ సబ్‌సెంటర్ పరిధిలోని పీఎం టీబీ క్యాంపైన్ జాతీయ క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆ కాలనీలో 60సంవత్సరాల పైబడిన వృద్ధులకు, సుగరు, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు దాదాపు 55మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి ఈశ్వరమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు యల్లప్ప, శ్రీనివాసులు, ఆదోని క్షయ ఆరోగ్య పర్యావేక్షకులు స్వరూప్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు సకాలంలో నడపాలి

ఆదోని సెంట్రల్: ఈనెల 12న కళాశాలలు, పాఠశాలలు ప్రారంభం కాబోతున్నాయని, ఆర్టీసీ డిపో నుంచి సకాలంలో గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, పట్టణాధ్యక్షులు శశిధర్ కోరారు. ఈ మేరకు సోమవారం డిపో కార్యాలయంలో డిపో మేనేజర్ రఫీకి వినతి పత్రం అందించారు.


రైళ్లను పునరుద్ధరించాలి

ఆదోని రూరల్: కరోనా సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసిన రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, సీపీఐ పట్టణ మండల కార్యదర్శులు కల్లుబావిరాజు, సుదర్శన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైల్వేస్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, కుమారస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

'వేతనాన్ని నిలిపివేసి వేధిస్తున్నారు'

ఆదోని రూరల్: ఉద్దేశపూర్వకంగా ఏప్రిల్ నెలకు సంబంధించి తన వేతనాన్ని నిలిపివేసి వేధిస్తున్నారని ఆదోని మండలం కపటి ఇంజనీరింగ్ అసిస్టెంట్ వీరేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ఇన్‌చార్జ్ మండల పీఆర్ ఏఈగా కొంతకాలం పని చేశానని, ఆ తర్వాత రిలీవ్ అయ్యి తన స్థానంలో యథావిధిగా కొనసాగుతున్నానని చెప్పారు. కాకపోతే జాయినింగ్ లెటర్ ఇవ్వాలంటూ డీడీఓ నాగమణి, ఎంపీడీఓ ఇబ్బంది పెట్టి వేతనాన్ని నిలిపివేశారని వాపోయాడు. తన స్థానంలో కొనసాగడానికి మళ్లీ కొత్తగా జాయినింగ్ లెటర్ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తన వేతనాన్ని ఇప్పించాలని కోరారు.

కనీస వేతనమివ్వాలి



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

ఆదోని టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మి కులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణాధ్యక్ష కార్యదర్శులు గోపాల్, తిప్పన్న, సహాయ కార్యదర్శి లక్ష్మన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు సమ్మె నోటీసు అందించారు.కార్యక్రమంలో కార్మికులు మహమ్మద్‌పీరా, దేవేంద్ర, కైలాస, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: తమ సమస్యల సాధన కోసం గత 34 రోజులుగా దీక్ష చేస్తున్నామని అయినా ప్రభుత్వం స్పందించడం లేదని, సత్వరం తమ సమస్యలను పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘ అధ్యక్షుడు నారాయణ కోరారు. సోమవారం కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు. వారికి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సత్యన్న మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు బాలరాజు, బాబు, మునెప్ప, జయరాం తదితరులు పాల్గొన్నారు.